క్లుప్తంగా

రేషన్ బియ్యం పంపిణీ

పాలకొండ: రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో రేషన్ బియ్యం పంపిణీని బుధవారం ఆయన పరిశీలించారు. రేషన్ పంపిణీ తీరుపై కార్డుదారుల వద్ద ఆరాతీశారు. బియ్యం పంపిణీలో ఎక్కడ లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని వీఆర్వో శ్రీనివాసరావును ఆదేశించారు.

శ్రీరాముని అక్షింతల తిరువీధి



శ్రీరాముని అక్షింతలను ఊరేగిస్తున్న గ్రామ పెద్దలు

భామిని: మండలంలోని వడ్డంగిలో బుధవారం అయోధ్య నుంచి వచ్చిన పవిత్ర అక్షింతలను ఊరేగించారు. గ్రామస్తులు, మహిళలు మేళ తాళాలు, ముగ్గులతో ఊరేగింపులో పాల్గొన్నారు. ప్రతీ ఇంటికి శ్రీరాముని దివ్యాక్షింతలను అందజేశారు. కార్యక్రమంలో గాయత్రీ పరివార్ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్లంబింగ్ కోర్సులో ఉచిత శిక్షణ

గుమ్మలక్ష్మీపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పనలో భాగంగా భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐలో జనరల్ ప్లంబింగ్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఎంపికైన వారికి రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 10వ తేదీలోగా భద్రగిరి ఆర్ఐటీఐలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. శిక్షణ కాలంలో దూరప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు బస్‌ఛార్జీలతో పాటు ఒక పూట భోజనం అందించడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 8978878557 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

సీతంపేట: మండలంలోని పెద్దూరులో సీతారామ ఆలయం నిర్మాణానికి ఎమ్మెల్యే ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బుధవారం శంకుస్థాపన చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు రూ.10 లక్షలతో ఈ ఆలయాన్ని నిర్మించనున్నట్లు చెప్పారు. ఆలయ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని గ్రామ పెద్దలకు సూచించారు. టీటీడీ నిధులతో పంచాయతీలో ఆలయాలు నిర్మించాలనుకుంటే తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆదినారాయణ, సర్పంచ్ హెచ్.ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు చైతన్య ర్యాలీ



ఓటరు చైతన్య ర్యాలీలో పాల్గొన్న ఆర్డీఓ లావణ్య

కురుపాం: మండల కేంద్రంలో 'నీ ఓటు నీ భవిష్యత్' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్డీఓ ఎం.లావణ్య ఓటు హక్కు ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని, ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఓటరు చైతన్య ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి

పాలకొండ రూరల్: ప్రజల సమన్వయంతో గ్రామాభివృద్ధికి బాటలు వేద్దామని సర్పంచ్ రణస్థలం రమాదేవి, టి.ఉపేంద్రకుమార్ అన్నారు. మండలంలోని ఎం.సింగుపురం, లుంబూరు గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి నిధులు, జీజీఎంపీ నిధులతో గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై గ్రామస్తుల అభిప్రాయాలు సేకరించారు. గుర్తించిన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టనున్నట్లు చెప్పారు.

క్రీడాకారుడిని అభినందించిన సీఐ



సిద్ధార్థ్‌ను అభినందిస్తున్న సీఐ సత్యనారాయణ

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభకనపర్చిన విద్యార్థి ఆరిక సిద్ధార్థను ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ బుధవారం అభినందించారు. మండలంలోని భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ బాయ్స్ జూనియర్ కాలేజీలో సెకండ్ ఇంటర్ చదువుతున్న సిద్ధార్థ్ ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో పి.కోనవలసలో ఇటీవల జరిగిన స్టేట్ లెవెల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో అండర్-19 విభాగంలో 3 సిల్వర్ పతకాలు సాధించాడు. 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం, 200 మీటర్ల పరుగుపందెంలో ద్వితీయ స్థానం, లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచాడు. సిద్ధార్థ్‌తో పాటు అతనికి శిక్షణ ఇస్తున్న కోచ్ రామకృష్ణను సీఐ అభినందించారు.

మాట తప్పని వ్యక్తి సీఎం జగన్

- సంక్షేమ పాలనలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శం
- వైఎస్సార్ పింఛన్ కానుక మొత్తం రూ.3 వేలకు పెంపు
- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



పాలకొండ: కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

సీతంపేట: మాట తప్పని, మడమ తిప్పని ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలుస్తారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కొత్తగా మంజూరైన పింఛన్లను బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచారన్నారు. ఈ నెల నుంచే పెంచిన మొత్తాన్ని అందజేస్తున్నట్లు చెప్పారు. అలాగే మండలంలో 823 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయన్నారు. రాష్ట్రంలో 68 లక్షల మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారని, పింఛన్ల కోసం ప్రభుత్వం ఏటా రూ.24 వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. సికిల్ సెల్ ఎనిమియా, డయాలిసిస్ పేషెంట్లకు నెలకు రూ.10 వేలు పింఛన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం మనదే అన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, గ్రామ వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛన్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరవేస్తున్నామన్నారు. పేదలకు మేలుచేస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందిరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.గీతాంజలి, ఈఓపీఆర్డీ సత్యం, పరిపాలనాధికారి మాస, ఎంపీపీ బి.ఆదినారాయణ, వైస్ ఎంపీపీ కె.సరస్వతి, జెడ్పీటీసీ ఎస్.లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహనరావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు ఎస్.లక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ సుమిత్రారావు, సర్పంచ్‌లు ఎ.కళావతి, హెచ్.ఆదిలక్ష్మి, ఎస్.సుశీల, తిరుపతిరావు, ఎంపీటీసీలు చంద్రశేఖర్, పగడాలమ్మ, మంగయ్య, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పాలకొండ: పేదల కళ్లలో ఆనందం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి నిరంతరం పనిచేస్తున్నారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం నూతన పింఛన్ల పంపిణీ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. నవరత్నాలలో భాగంగా పింఛన్ల పెంపును చేపట్టారని అన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని కోరారు. మండలానికి నూతనంగా మంజూరు చేసిన 87 పింఛన్లను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మాళి భాను, వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్‌రావు, ఎంపీడీఓ డి.త్రినాథ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సీతంపేట: కార్యక్రమానికి హాజరైన పింఛన్ లబ్ధిదారులు

వైఎస్సార్‌సీపీలో 40 కుటుంబాలు చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరినవారికి కుండువాలు వేసి ఆహ్వానిస్తున్న పరీక్షిత్‌రాజు, పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: కురుపాం మండలం బియ్యాలవలస పంచాయతీ దురిబిలి గ్రామానికి చెందిన 40 కుటుంబాలు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. చినమేరంగిలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు సమక్షంలో వారంతా టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, పరిపాలన నచ్చి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వారంతా తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారికి పార్టీలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీలో చేరిన వారిలో తోయక చంటి, నిమ్మక రాంబాబు, బిడ్డిక దుర్గారావు, తోయక నగేష్, ఆరిక రాజారావుతో పాటు కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, నాయకులు శెట్టి నాగేశ్వరరావు, వైస్ సర్పంచ్ ఆదిల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



ప్రసంగిస్తున్న బ్రదర్ దీవెనయ్య

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని హెచ్ గ్రౌండు (క్రీడా మైదానం) వద్ద ఈనెల 2 నుంచి సువార్త ఉజ్జీవ సభలు నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల పాస్టర్ల సంఘాల ఆధ్వర్యంలో ఉజ్జీవ సభలు జరుగుతున్నాయి. బుధవారం సాయంత్రం జరిగిన సభకు వర్తమానికునిగా పాల్గొన్న బ్రదర్ దీవెనయ్య ప్రసంగిస్తూ.. యేసుక్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని, పరిశుద్ధాత్మతో జీవించాలని కోరారు. సభకు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీస్తు విశ్వాసకులు హాజరై ప్రార్థనలు చేశారు.

నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లకు సూచనలు చేస్తున్న ఎస్సై శివప్రసాద్

గుమ్మలక్ష్మీపురం: వాహనదారులు, ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలని ఎల్విన్‌పేట ఎస్సై శివప్రసాద్ అన్నారు. గుమ్మలక్ష్మీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో బుధవారం ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించరాదని, అతివేగం వద్దని, అన్ని రికార్డులు వెంట ఉంచుకోవాలని, యూనిఫాం ధరించాలని, ఎక్కడపడితే అక్కడ ఆటోలను నిలపొద్దని సూచించారు. రోడ్డు భద్రత నిబంధనలు కచ్చితంగా పాటించాలని కోరారు. నియమాలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

కొమరాడ: మండలంలోని పలు గ్రామల పరిధిలో విద్యుత్ వైర్లు సరిచేయడం, చెట్టు కొమ్మలు తొలగింపు పనులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ అధికారి గొర్లి వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొమరాడ, గంగారేగువలస, కొట్టు సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరాఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

7న నవోదయ మోడల్ టెస్ట్

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలోని జియ్యమ్మవలస మండలం పెదమేరంగి జంక్షన్‌లో ఉన్న తిరుమల సాయి హైస్కూల్‌లో ఈనెల 7న జిల్లా స్థాయి నవోదయ మోడల్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జి.ఉమామహేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పరీక్షను ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదుతో పాటు మెమోంటోలను బహూకరించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు 7032631720, 9866118298 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆశ్రమపాఠశాల తనిఖీ

సీతంపేట: మండలంలోని సామరెల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి బుధవారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పాఠశాలను సందర్శించి రికార్డులు, ఉపాధ్యాయ డైరీలు, లెస్సన్ ప్లాన్లను తనిఖీ చేశారు. విద్యార్థులకు పలు సబ్జెక్టుల్లోని ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టడం ద్వారా వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. హెచ్‌ఎం ఆరిక భాస్కరరావు, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి



యాప్‌లో వివరాలను పరిశీలిస్తున్న నోడల్ అధికారి

పాలకొండ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా నోడల్ అధికారి డాక్టర్ టి.రమేష్ అన్నారు. పట్టణంలోని వెంకమ్మపేట పాఠశాల ఆవరణలో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించారు. అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు.

సావిత్రిబాయి స్ఫూర్తి ప్రదాత..

ప్రపథమ మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే యువతకు స్ఫూర్తి ప్రదాత.. ఆ రోజుల్లోనే క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొని తనకు ఎంతో ఇష్టమైన ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి, ఎంతోమంది మహిళలను చైతన్య పరిచిన ధీశాలి.. మూఢ నమ్మకాలను పారదోలి.. మహిళల చదువుకు ఎంతో కృషి చేసిన సావిత్రిబాయి పూలే జయంతిని జాతీయ మహిళా దినోత్సవంగా బుధవారం ఘనంగా జరుపుకున్నారు.. ఈక్రమంలో పలు పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులను సన్మానించడంతో పాటు సావిత్రిబాయి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. - పాలకొండ/కురుపాం నెట్‌వర్క్



పాలకొండ రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి పూలే విశిష్టతను విద్యార్థులకు వివరిస్తున్న ప్రిన్స్‌పాల్ శ్యామ్‌బాబు



సీతంపేట: దోనుబాయి ఆశ్రమ పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న హెచ్‌ఎం సుబ్బారావు, తదితరులు



సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



జియ్యమ్మవలస: నీచుకవలసలో ఉపాధ్యాయినిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సరిహద్దులో అప్రమత్తం



భామిని చెక్‌పోస్టు వద్ద రికార్డులు పరిశీలిస్తున్న సీఐ చంద్రమౌళి

భామిని: రానున్న ఎన్నికల నేపథ్యలో ఆంధ్రా-ఒడిస్సా సరిహద్దులో అప్రమత్తంగా ఉండాలని పాలకొండ సీఐ ఎం.చంద్రమౌళి సిబ్బందికి సూచించారు. బత్తిలి ఎస్సై చిట్టిపూలు ప్రసాద్‌తో కలిసి బత్తిలి, భామిని సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను బుధవారం తనిఖీ చేశారు. ఒడిస్సా నుంచి వచ్చి పోయో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, మద్యం, నిషేధిత పదార్థాల తరలింపుపై నిఘా పెట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మండలంలోని పలు వివాదస్పద గ్రామాల్లో పర్యటించి పోలింగ్ కేంద్రాల్లో వసతులను పరిశీలించారు.

పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే



విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బుధవారం సందర్శించారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. రెండో తరగతి విద్యార్థులతో ఆంగ్ల పాఠ్యాంశాలు చదివించారు. వారు చక్కగా చదవడంతో ఉపాధ్యాయుల బోధనపై సంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులను కల్పిస్తున్నారని, విద్యార్థులు వాటిని చక్కగా వినియోగించుకుని బాగా చదువుకోవాలని సూచించారు. హెచ్‌ఎం సవర ప్రసాదు, ఉపాధ్యాయుడు నెల్లి సత్యంనాయుడు, సర్పంచ్ హెచ్.ఆదిలక్ష్మి ఉన్నారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ



అగ్నిప్రమాదంలో చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలో డెమో ద్వారా వివరిస్తున్న అధికారి

పాలకొండ రూరల్: అవగాహన పెంచుకుంటే అగ్ని ప్రమాదాల వలన సంభవించే ప్రమాదాలను అధిగమించవచ్చని సంబంధిత శాఖ అధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. పాలకొండ పట్టణంలోని గాయత్రి స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో అగ్ని ప్రమాదాల నియంత్రణపై బుధవారం ప్రత్యేక డెమో నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగినపుడు వాటి నుంచి సురక్షతంగా బయటపడే మెళకువలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. ఆస్తి, ప్రాణ నష్టాలను అధిగమించే చర్యలను వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



పాలకొండ రూరల్: ఏరియా ఆస్పత్రిలో లబ్ధిదారులకు పింఛను అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్, వలంటీర్లు

పాలకొండ రూరల్: అర్హులు ఉన్నచోటకే వచ్చి పింఛన్ డబ్బులు అందిస్తుండటంతో ప్రభుత్వ పనితీరుపై లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నవగాం సచివాలయం పరిధిలో పలు గ్రామాలకు చెందిన వన్నల అప్పయ్య, రాముడమ్మ, బూరాడ నర్సింగరావు, బి.అచ్చన్నమ్మ, దవిడ దుర్గమ్మ వివిధ ఆరోగ్య సమస్యలతో పాలకొండ ఏరియా ఆస్పత్రిలో సేవలు పొందుతున్నారు. వారికి సంబంధించిన పింఛను మొత్తాలను సచివాలయ వెల్ఫేర్ అధికారి షేక్ రిజ్వాన్, వలంటీర్లు జి.సంగమేష్, బి.జ్యోతి, టి.త్రివేణి బుధవారం ఆస్పత్రికి వెళ్లి లబ్ధిదారులకు అందించారు.

340 లీటర్ల సారా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సారాతో సీఐ, ఎస్సై

కురుపాం: స్కార్పియో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న సారాను మండలంలోని మూలిగూడ జంక్షన్ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి ఎల్విన్‌పేట పోలీసులు పట్టుకున్నారు. సీఐ సత్యనారాయణ, ఎస్సై షణ్ముఖరావు మాట్లాడుతూ.. ముందస్తు సమాచారం మేరకు వాహనాలు తనిఖీ చేయగా.. ఒడిశా నుంచి వస్తున్న స్కార్పియో వాహనంలో ట్యూబ్, క్యాన్‌ల ద్వారా సుమారు 340 లీటర్ల సారాను తరలిస్తున్నట్లు గుర్తించి వాహనంతో పాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వాహనంలో ఉన్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సకాలంలో టీకాలు వేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ జగన్మోహనరావు

గరుగుబిల్లి: అర్హులైన చిన్నారులకు, గర్భిణీలకు క్రమం తప్పకుండా టీకాలు వేయాంచాలని జిల్లా హెల్త్ ప్రోగ్రాం అధికారి డా. టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని చినగుడబ, ఎస్ఆర్.పేట గ్రామాలలో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీకాలకు అర్హులైన గర్భిణీలు, పిల్లల వివరాలు, ఎంసీపీ రికార్డులను పరిశీలించారు. పిల్లలకు టీకాలు వేయాల్సిన గడువు తేదీలను నిశితంగా పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. అత్యవసర మందుల కిట్ (ఏఈఎస్ఐ)ను పరిశీలించారు. యూవిన్ పోర్టల్‌లో వ్యాక్సినేషన్ వివరాలను నమోదు చేయాలన్నారు. పిల్లలో శ్వాసకోశ సంబంధమైన వ్యాధులపై, హైరిస్క్ గర్భిణిల పట్ల అప్రమత్తంగా ఉండాలని గుర్తించాలని సూచించారు. ఏఎన్ఎంలు రవణమ్మ, ఈశ్వరమ్మ, తదితరులున్నారు.

ప్రేమ, కరుణ పంచడమే క్రైస్తవం



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే కళావతి, తదితరులు

భామిని: సర్వ మానవాళికి ప్రేమ, కరుణ పంచడమే ఏసుక్రీస్తు తత్వమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని పోలీస్ కోట గిరిజన గ్రామంలో నూతనంగా నిర్మించిన చర్చి ప్రారంభోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కళావతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మానసిక ప్రశాంతత కోసం ప్రతిరోజు దైవప్రార్థనలు చేయాలన్నారు. క్రైస్తవ మతబోధకులు దివ్యబలిపూజ చేసి బైబిల్ వాఖ్యాలను వినిపించారు. అనంతరం స్థానిక సర్పంచ్ బిడ్డిక నారాయణతో కలిసి ఆదివాసీలతో ముచ్చటించారు. అంతకు ముందు గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే కళావతికి గ్రామస్తులు ఆదివాసీ సంప్రదాయంలో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తోట సింహాచలం, బోనగడ్డి ధర్మారావు, బొడ్డేపల్లి ప్రసాద్, అగతముడి శేషగిరి, టంకాల శ్రీను, పతివాడ పగడాలమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.